క్లుప్తంగా

బాధిత కుటుంబానికి వితరణ



బాధిత కుంటుంబానికి సాయం అందజేసిన కానిస్టేబుళ్లు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన రాంబాబుకు ఇటీవల డాబాపై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో నడవ లేని స్థితిలో ఇంటి వద్దే ఉంటున్నాడు. కూలీ పని చేసుకుని జీవించే ఆ కుటుంబానికి సాయం చేసేందుకు దీవెన ఫౌండేషన్ స్పందించింది. ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరఫున రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబానికి సమకూర్చారు. అమలాపురం క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ సుధాకర్ ఫౌండేషన్ తరఫున బాధిత కుటుంబానికి శుక్రవారం సామగ్రిని అందజేశారు. బాధిత కుటుంబం ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

బాలబాలికలకు యోగా శిక్షణ



యోగాలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

అమలాపురం టౌన్: సత్యసాయి బాల వికాస్ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో బాలి బాలికలకు జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శుక్రవారం యోగాలో శిక్షణ ఇచ్చారు. భట్లపాలెం బీఈసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఎం.తిలక్ యోగా, సూర్య నమస్కారాలపై శిక్షణ ఇచ్చి, వారితో ఆసనాలు వేయించారు. జిల్లా సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్ శిక్షణ ఇస్తూ రామాయణంలోని లక్ష్మణుడు, హనుమంతుడి పాత్రలపై, వారి గుణగణాలపై బాలబాలికలకు వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల డివిజన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, జిల్లా బాల వికాస్ కేంద్రాల గురువు శిష్టా గుణరంజన్, బాల వికాస్ ప్రతినిధులు భవాని, విజయ పలు నీతి కథలు, కుటుంబ విలువలపై అవగాహన కల్పించారు.

వలంటీర్ల రాజీనామా



చొల్లంగిలో రాజీనామాలు చేసిన వలంటీర్లు

తాళ్లరేవు: చొల్లంగి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 20 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్‌కు అందజేశారు. తమకెంతో గౌరవమిచ్చిన తమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయం కోసం శ్రమించేందుకే రాజీనామాలు చేసినట్టు వారు ప్రకటించారు.

బాలిక హత్య కేసులో చార్జిషీట్ దాఖలు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా సంచలనం సృష్టించిన తొమ్మిదేళ్ల బాలిక హత్య కేసుకు సంబంధించి శుక్రవారం పోలీసులు పోక్సో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసుకు సంబంధించి 600 పేజీల నివేదికను అందజేశారు. ఇటీవల తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, అనంతరం హతమార్చి, డ్రైనేజీలో పడేసిన ఘటన సంచలనమైంది. ఈ నేపథ్యంలో నిందితుల అరెస్టు కోరుతూ యానాం తదితర రీజియన్లలో నిరసన ర్యాలీలు జరిగాయి. సీఎం రంగసామి, హోమ్ మంత్రి నమశ్శివాయం ఈ ఘటనపై స్పందించి, విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో ముథిలియపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులు సోందా వివేకానందన్(56), కరుణాస్(19)ను అరెస్ట్ చేసి, పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. ఫోరెన్సిక్, విచారణ నివేదిక, అరెస్ట్ వారెంట్లు, 83 మంది సాక్షుల స్టేట్‌మెంట్లు, 15 ముఖ్యమైన డాక్యుమెంట్లను కోర్టుకు అందజేశారు.

29 ఏళ్లు కష్టపడితే.. టికెట్ ఇవ్వలేదు

ప్రచారంలో టీడీపీ రెబల్ అభ్యర్థి ఆవేదన

ఉప్పలగుప్తం: టీడీపీలో 29 ఏళ్లు అహర్నిశలు శ్రమించి పనిచేశాను.. అంతచేసినా అసెంబ్లీ టికెట్ రాకుండా కొన్ని శక్తులు అడ్డుపడ్డాయంటూ ఆ పార్టీ రెబల్ అభ్యర్థి పరమట శ్యామ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కార్యకర్తలంతా తన వైపే ఉన్నారని స్పష్టం చేశబూరు. మండలంలోని కూనవరం, గోపవరం, గొల్లవిల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఓటరు వద్దకెళ్లి.. టీడీపీలో 29 ఏళ్లు కష్టపడి సేవలందించిన తనకు టికెట్ రాకుండా కొన్ని శక్తులు అడ్డుపడ్డాయని చెప్పారు. అందుకే నియోజకవర్గ శ్రేయస్సు కోసం స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగోలు పెద్దకాపు, బి.శ్రీను, శివగంగ శ్రీను, ఇంటిపల్లి నాగబాబు, తొత్తరమూడి సాయి, పరమట భీమమహేష్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా మారబడి



పాఠశాల ప్రధాన ద్వారం



నాడు–నేడు పథకంలో సర్వాంగ సుందరంగా మారిన పోలేకుర్రు ప్రాథమిక పాఠశాల

- నాడు అధ్వానం.. నేడు అద్భుతం
- విద్యా వ్యవస్థలో సమూల మార్పులు
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు
- పరీక్షల్లో మెరుగైన ఫలితాలు

తాళ్లరేవు: విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చింది. ఒకప్పుడు కనీస సౌకర్యాలు కూడా లేకుండా, అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను, నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా రూపొందించారు. ప్రతి తరగతి గదిలో అత్యాధునిక ఫర్నిచర్, బ్లాక్ బోర్డులతో పాటు, సురక్షిత తాగునీటి సౌకర్యం, ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం, విద్యార్థుల అవగాహన కోసం అనేక పెయింటింగ్‌లతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సర్కారీ బడి అంటే ఇంతేనా.. అనే స్థాయి నుంచి ఆధునిక బోధన, క్రమశిక్షణతో కూడిన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలే మంచిదనే స్థాయికి బడులను తీసుకెళ్లారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాడు–నేడు నిధులు సుమారు రూ.57 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నాడు–నేడు నిధులు సుమారు రూ.57 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశారు.

మండలం	పాఠశాలలు	నిధులు (రూ.ల్లో)
తాళ్లరేవు	73	14 కోట్లు
ఐ.పోలవరం	52	10 కోట్లు
ముమ్మిడివరం	45	20 కోట్లు
కాట్రేనికోన	45	13 కోట్లు
మొత్తం	215	57 కోట్లు

ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యాబోధన

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారు. పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు, మెరుగైన విద్యను అందించేందుకు అనేక చర్యలు చేపట్టారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా మెరుగైన కంటెంట్‌తో పాటు, విలువైన ట్యాబ్‌లను ఉచితంగా అందించారు. గత రెండేళ్లలో తాళ్లరేవు మండలంలో 1,800 మందికిపైగా విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఒకడుగు ముందుకు వేసి పట్టణాలు, నగరాలకే పరిమితమైన డిజిటల్ బోధనను మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం అందిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి స్మార్ట్ క్లాస్‌రూములను అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు ఇప్పటికే ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ఫాం పానెల్స్(ఐఎఫ్‌పి) ద్వారా విద్యాబోధన చేపట్టారు. తాళ్లరేవు మండలంలో 91 తరగతి గదుల్లో డిజిటల్ విద్యాబోధనను అందుబాటులోకి తెచ్చారు, అలాగే విద్యార్థినీ, విద్యార్థుల సామర్థ్యం పెంపే లక్ష్యంగా వినూత్న డిజిటల్ విద్యను అందిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కాన్వెంట్లను వదిలి.. సర్కారీ బడులకు..

గతంలో మెరుగైన విద్య కోసం కాన్వెంట్లకు పంపించేవారమని, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి, అత్యాధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, పుస్తకాల నుంచి యూనిఫాం, బూట్ల వరకన్నీ ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుండడంతో.. ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనభ్యసిస్తూ పరీక్షల్లో సైతం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో పిల్లల చదువుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకపోగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందుతుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుందాం



అమలాపురం పదో వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్ భార్య బేబీ మీనాక్షి

అమలాపురం టౌన్: మన మంచి కోరే ప్రభుత్వాన్ని మళ్లీ స్వాగతిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీ మళ్లీ గెలిపించుకుందామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. విశ్వరూప్‌కు మద్దతుగా అమలాపురం పదో వార్డులో బేబీ మీనాక్షి, 20వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బేబీ మీనాక్షికి పదో వార్డులో మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. 20వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.ఆయా ప్రచార కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, నాగారపు వెంకటేశ్వరరావు, ఉండ్రు వెంకటేష్, కల్వకొలను ఉమ, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

యానాం: జవహర్ నవోదయ విద్యాలయ పరీక్షా కేంద్రంగా ఈ నెల ఐదున నిర్వహించనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నీట్ కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 123 మంది అభ్యర్థులకు ఈ పరీక్షా కేంద్రాన్ని కేటాయించారన్నారు. అభ్యర్థులను ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి నిబంధనల ప్రకారం అనుమతి ఉండదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు వచ్చేటప్పుడు అడ్మిట్‌కార్డుతో పాటు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులో ఏదైనా ఒకటి తేవాలన్నారు. సాధారణ దుస్తులతో మాత్రమే హాజరుకావాలని, మందపాటి చెప్పులు, మెటల్ బటన్స్, ఆభరణాలు అనుమతి లేదన్నారు. స్మార్ట్‌వాచ్, ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు, పర్సు, హ్యాండ్ బ్యాగ్, కాలిక్యులేటర్, రైటింగ్ ప్యాడ్ తదితర వాటిని అనుమతించరని తెలిపారు.

తీరంలో ప్రతి ఇంటికీ మంచి నీరు



బలుసుతిప్పలో పొన్నాడకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను పూలమాలతో సత్కరిస్తున్న మహిళ

ఎమ్మెల్యే, ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ

కాట్రేనికోన: శివారు ప్రాంతాలతో పాటు, సముద్ర తీరంలోని మగసానితిప్ప వంటి గ్రామానికి సైతం రక్షిత మంచి నీరు అందించామని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర తదితర గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, నాతి అలివేణి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో ఆయా గ్రామాలకు చెందిన అగ్నికుల క్షత్రియులు పొన్నాడకు బ్రహ్మరథం పట్టారు. ముందుగా బలుసుతిప్పలో కామేశ్వరమ్మను దర్శించుకున్నారు. శివారు ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. చాకలిపేట, కొత్తపాలెం, మొల్లేటి మొగ, గొల్లపేటకు చెందిన ప్రజలు గుక్కెడు మంచి నీటి కోసం సముద్ర తీరంలోని నీటి గుంటల్లో నీరు తెచ్చుకునే వారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటా కుళాయిలు వేసి ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీటిని అందిస్తున్నామన్నారు. మత్స్యకారులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, అనేక సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. టీడీపీ నేతలు వలంటీర్ వ్యవస్థను అడ్డుకోవడంతో, పింఛను సొమ్ము కోసం లబ్ధిదారులు బ్యాంకులు, సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోని వస్తుందని, అవ్వాతాతలకు వారి ఇంటి వద్దే పింఛను సొమ్ము అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లను వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మల్లాడి ఆదినారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, ఓలేటి సతీష్, తిరుమాని సత్తిబాబు, కామాడి గంగాద్రి, బర్రే రాంబాబు, పెమ్మాడి రాముడు, సముద్రుడు, నల్లా నరసింహమూర్తి, పాలెపు ధర్మారావు, నాతి సత్యనారాయణ, రేవు ధర్మా రావు, మూదే శ్రీను, శేరు ధర్మారావు, ఓలేటి భవాన్, దాసరి కాసుబాబు, ఏడుకొండలు, అప్పల నరసయ్య, రామాడి వీర్రాజు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేది జగన్ మాత్రమే

- మంత్రి, అమలాపురం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్
- భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం



భీమనపల్లిలో ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



విలసవిల్లిలో వలంటీర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు చెప్పిన హామీలను కచ్చితంగా అమలు చేసి, ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేసే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన శుక్రవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన మంచిని, మరలా జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేసే మంచిని ప్రజలకు వివరించారు. ఆయనకు మహిళలు హారతులు పట్టి, అభిమానులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల్లో ప్రతిసారి ప్రజలను మభ్య పెట్టడానికి ఏదోక పార్టీతో జత కట్టి, మోసపూరిత హామీలను ప్రజల ముందుకు తీసుకొస్తారన్నారు. 2009లో చంద్రబాబు అన్ని పార్టీలతో కూటమి పెట్టుకునే ప్రజలను మోసం చేయడానికి సిద్ధపడితే, ప్రజలు మంచి వైపు నిలబడే వైఎస్ రాజశేఖరరెడ్డిని గెలిపించి ముఖ్యమంత్రి చేశారన్నారు. 2014లో బీజేపీ, జనసేనతో కూటమిగా ఏర్పడి ఒక మేనిఫెస్టో విడుదల చేసి, వారి ప్రభుత్వం వచ్చాక దానిని నెరవేర్చకపోగా, శాశ్వతంగా వెబ్‌సైట్ నుంచే తొలగించారని గుర్తుచేశారు. ఇలాంటి మోసపూరిత హామీలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే, చంద్రబాబుకు బుద్ధి చెబుతూ ఉన్నారన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేయడంతో, ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీవైపే ఉందన్నారు. కులాలకు, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

ఈ సందర్భంగా భీమనపల్లి జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు గోలకోటి వెంకటేష్ మంత్రి విశ్వరూప్ సమక్షంలో పార్టీలో చేరారు. విలసవిల్లి గ్రామంలో రాజీనామా చేసిన 19 మంది వలంటీర్లు విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలకు వివరించి, మరలా గెలిపించుకుంటామని వారు నినాదాలు చేశారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ గెడ్డం సంపదరావు, సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, సలాది ఊర్మిళాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షులు సలాది సతీష్, మేడిశెట్టి సూరిబాబు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, ఏఎంసీ మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, మాజీ ఎంపీపీ శిరంగు రాజా, మాజీ సర్పంచ్ యాళ్ల లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు ఇళ్ల కృష్ణ, జంపన బాపిరాజు, రాయపురెడ్డి నాగు, కోళ్లపల్లి భగవాన్, మానే దుర్గ, కృష్ణ, కిషోర్, బళ్ల నాగ సతీష్, కోలా ఏసు, పుత్స్యల ఏసు, సామంతకుర్తి చిరంజీవి, ఆకేటి సత్యవిష్ణు తదితరులు పాల్గొన్నారు.

పింఛను అందదేమోనని..

ఆందోళనకు గురై గుండెపోటుతో వృద్ధుడి మృతి



పింఛను అందుకోకుండానే మృతిచెందిన సత్తిరాజు

అమలాపురం టౌన్: పింఛను సొమ్ము ఏ బ్యాంక్‌లో పడిందో తెలీక ఆందోళనకు గురైన ఓ వృద్ధుడు గుండెపోటుతో మరణించిన ఉదంతమిది. అమలాపురం 27వ వార్డుకు చెందిన పట్టా సత్తిరాజు (76) తనకు వచ్చిన పింఛను నగదు ఎక్కడకు వెళ్లి తీసుకోవాలో అర్థం కాక ఆందోళనకు గురై గురువారం రాత్రి కన్నుమూశాడు. వలంటీర్ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛను డబ్బు ఇచ్చి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో సత్తిరాజు వార్డు సచివాలయానికి వెళ్లాడు. నీకు ఇక్కడ కాదు, బ్యాంక్‌లో డబ్బు పడుతుంది, వెళ్లి తీసుకోవాలని సచివాలయ సిబ్బంది సూచించారు. గురువారం మధ్యాహ్నం మండుటెండలో కాలినడకన సచివాలయానికి వెళ్లిన సత్తిరాజు.. ఏ బ్యాంక్‌లో తన డబ్బు పడిందో తెలీక ఆందోళనకు గురై ఇంటికి తిరిగి చేరుకున్నాడని వార్డు కౌన్సిలర్ బండారు గోవింద్ తెలిపారు. నీరసించి ఇంటి పట్టున ఉన్న సత్తిరాజు గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్టు చెప్పారు. మృతుడు సత్తిరాజు 26వ వార్డు కౌన్సిలర్ యండమూరి గంగ తండ్రి కావడంతో ఆ రెండు వార్డుల్లో విషాదం అలుముకుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వాకంతోనే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇవ్వడం నిలిచిపోయిందని 26, 27 వార్డులకు చెందిన పలువురు పింఛనుదారులు ధ్వజమెత్తారు. పింఛను అందుకోకుండానే సత్తిరాజు మృతిచెందడంతో తోటి పింఛనుదారులు విచారం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



జనసేన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్ కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడూరి దుర్గారావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నుంచి సుమారు 100 మంది కాపు సామాజిక వర్గానికి చెందిన వారు మంత్రి విశ్వరూప్ సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్‌పై మక్కువతో ఇన్నాళ్లు ఆ పార్టీలో కొనసాగామని, ఆయన టీడీపీకి మద్దతు ఇవ్వడంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని వారు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని, అందుకు విశ్వరూప్ వెంట నడవాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి విశ్వరూప్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, బొడ్డు నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, నాయకులు మోటూరి సత్యంకాపు, కుంచే చిన్ని పాల్గొన్నారు.

డీజిల్ అక్రమ దందాపై కేసు

అల్లవరం: ఓడలరేవులో బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సులకు అక్రమంగా సమకూర్చిన ఆయిల్‌ను నింపుతుండగా డీఎస్‌ఓ పాపారావు, అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్ శుక్రవారం దాడులు చేసి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. యానాం నుంచి అక్రమంగా తరలించిన డీజిల్‌ను బీవీసీ కళాశాలకు చెందిన బస్సులకు గుట్టుచప్పుడు కాకుండా వినియోగిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. బొలేరో వాహనంలో ఏర్పాటు చేసిన ట్యాంక్‌లో యానాం నుంచి తెచ్చిన డీజిల్‌ను బస్సుల్లోకి నింపుతుండగా, బెండమూర్లంక సెంటర్‌లో పెట్రోల్ బంక్ యాజమాని ఇచ్చిన సమాచారంతో సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై 6ఏ కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం



తాళ్లరేవులో ఇంటింటి ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: మండలంలోని పలు పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాళ్లరేవు, ఇంజరం, జార్జీపేట, జి.వేమవరం తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. తాళ్లరేవులో జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, రెడ్డిబాబు, గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంజరం పంచాయతీలో సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్, ఎంపీటీసీ కోరుకొండ కిరణ్‌కుమారి, చంటి, చిన్నరాజా, రామాంజనేయులు, జార్జీపేటలో గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు, రిటైర్డ్ జేడీఏ పెట్ల సూర్యనారాయణరాజు, దడాల జగదీశ్వరరావు, పెట్ల కాంతకుమారి, జి.వేమవరంలో ఎంపీటీసీ యర్రంనీడి అప్పారావు, గండి రామాంజనేయులు, నాయకులు దెయ్యాల సత్తిబాబు, మట్టా లింగమూర్తి, నీలపాల శ్రీను తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది రోడ్డు సెంటర్లో శుక్రవారం బైక్ ఢీకొని స్థానిక కూరగాయల వ్యాపారస్తుడు సి.పద్మనాభంకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ యువకుడు నడుపుతున్న బైక్ అదుపుతప్పి పద్మనాభం పైకి దూసుకెళ్లినట్టు స్థానికులు తెలిపారు. మలికిపురం మండలం కత్తిమండకు చెందిన అతడు అంతర్వేది రోడ్డు సెంటర్లో వ్యాపారం చేస్తున్నాడు. సఖినేటిపల్లికి చెందిన 108 అంబులెన్స్ టెక్నీషియన్ ఎస్.రాము సమాచారం అందుకుని హుటాహుటిన ఘటన స్థలానికి వచ్చారు. డ్రైవర్ సురేంద్ర సాయంతో పద్మనాభంను మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌లో ఫస్ట్ ఎయిడ్ చేసినట్టు, కాలు విరిగినట్టు, తలకు గాయాలు అయినట్టు రాము తెలిపారు. దీనిపై సఖినేటిపల్లి పోలీసు స్టేషన్‌కు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు చెప్పారు.

బాస్కెట్‌బాల్ విజేత యానాం



బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ విజేత యానాం జట్టుతో స్కూల్ గేమ్స్ ప్రతినిధులు

యానాం: పుదుచ్చేరి స్టేట్ స్కూల్స్‌గేమ్స్ చాంపియన్‌షిప్ అండర్–19 విభాగంలో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో యానాం జట్టు విజయభేరి మోగించి, చాంపియన్‌గా నిలిచింది. సెమీ ఫైనల్స్‌లో జోన్–1పై 31–48 స్కోర్‌తో విజయం సాధించిన యానాం జట్టు.. అనంతరం ఫైనల్స్‌లో జోన్–2లోని పాండిచ్చేరిపై 41–48 తేడాతో విజయం సాధించిందని ఆర్గనైజింగ్ సెక్రటరీ, పిఈటి పాము సత్యనారాయణ తెలిపారు. అద్భుత ప్రదర్శన చేసిన క్రీడాకారులను, వైవైబీఏ బాస్కెట్ బాల్ అధ్యక్షుడు చింతం రామకృష్ణ, కోచ్‌లు కె రమేష్, ఐవీకే మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ తదితరులను ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ అభినందించారు.

సేంద్రియ ఎరువులతో పొలాలకు సారం



మొసలపల్లిలో వరి చేలో ఉంచిన గొర్రెల మంద

అంబాజీపేట: సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువ దిగుబడుల కోసం అధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్న తరుణంలో భూసారం క్షీణించి పైరును తెగుళ్లు కబళిస్తున్నాయి. అవగాహన లోపంతో ఎదురవుతున్న కష్టాలను తొలగించుకోవాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం తప్పనిసరని అన్నదాతలు గుర్తిస్తున్నారు. మండలంలో వరి, కొబ్బరి, అరటి, కోకో తదితర పంటలు పండించే భూములకు గొర్రెలు, మేకలు, ఆవుల విసర్జితాలను అందించడంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఎరువులు భూసారాన్ని కాపాడతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంటకు జవసత్వాలు ఇచ్చి, నాణ్యమైన దిగుబడుల పెంపుదలకు దోహదం చేస్తాయంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో గొర్రెల మందలు రావడంతో పొలాల్లో నిలగడుతున్నారు. అధిక రసాయన, పురుగుమందుల వినియోగం వల్ల సారం కోల్పోయిన నేలలను సేంద్రియ ఎరువు వినియోగంతో తిరిగి సారవంతం చేయవచ్చని చెబుతున్నారు. పశువుల, గొర్రెల మూత్ర విసర్జనతో భూమిలోని చోడు విరిగిపోతుందని, వీటి విసర్జితాలలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు, సూక్ష్మ పోషకాలు లభిస్తాయని రైతులు సత్యనారాయణ, రాజగోపాలం చెబుతున్నారు. మంద కట్టుతో విసర్జితాలు నేరుగా భూమిలోకి వెళ్లడంతో అధిక లాభాలు ఉంటాయని వ్యవసాయాధికారులు చెప్పారన్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దుక్కు దున్నుకోవాలన్నారు. పొలాల్లో పశువులను కట్టడం ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ లభిస్తుందన్నారు. మేలు చేసే సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. తెగుళ్లు తగ్గుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.